క్లుప్తంగా

పంచముఖ ఆంజనేయ స్వామివారికి పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పూర్వాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని భీమన వారి పేటలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి శనివారం పంచామృత అభిషేకాలు, అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, విశేష అలంకరణ, నాగవల్లిలతో అష్టోత్తర పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. విశేష పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి పంచ హారతుల సేవ నిర్వహించారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని మద్యం దుకాణాలు, బారుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేశారు. శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ డి.చంద్రశేఖరరెడ్డి వివిధ బార్లు, మద్యం దుకాణాలు, వాక్ ఇన్‌స్టోర్‌లోని స్టాక్ వివరాలు, ఇండెంట్‌లు, బార్లు పాటించాల్సిన నియమాలను అమలు చేస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. అంతకు ముందు బార్లలోని మద్యం బాటిళ్ల శాంపిళ్లను సేకరించారు. తనిఖీల్లో ఆయన వెంట సీఐ వెంకట కృష్ణమూర్తి, ఎస్‌వీ రమేష్, ఎస్ఐ వాసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌జీ కమిషనర్‌గా రామగంగాధర్ నియామకం


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హిందుస్థాన్ స్కౌట్ – గైడ్స్ (హెచ్‌ఎస్‌జీ) రాష్ట్ర నూతన కమిషనర్‌గా దోర్వాసుల రామగంగాధర్ నియమితులయ్యారు. ఆయనను కమిషనర్‌గా నియమిస్తూ ఢిల్లీలోని జాతీయ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు హెడ్ క్వార్టర్ కమిషనర్ మానికొండ శ్రీధర్ తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని హెచ్‌ఎస్‌జీ కార్యాలయంలో మానికొండ శ్రీధర్ ఉత్తర్వు కాపీని రామగంగాధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులను భాగస్వాములను చేసి వారికి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

మణిపాల్ హాస్పిటల్‌లో హెర్నియాపై వర్క్‌షాప్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మణిపాల్ హాస్పిటల్స్, అసోసియేషన్ ఆఫ్ వరల్డ్–రెనోఫ్ సర్జన్స్ కన్సార్టియం భాగస్వామ్యంతో విజయవాడలోని హోటల్ తాజ్ వివంతాలో రెండు రోజుల వర్క్ షాప్ విజయవంతంగా ముగిసింది. హెర్నియాకు సంబంధించి వైద్యరంగంలో తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలనే ఆసక్తి ఉన్న వైద్య నిపుణులు, పలువురు ఔత్సాహికులు ఈ వర్క్ షాప్‌కు హాజరయ్యారు. మణిపాల్ హాస్పిటల్స్‌లోని రోబోటిక్ సర్జన్ డాక్టర్ జె.సురేంద్ర మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగిన ఈ వర్క్ షాప్ విజయవంతమైందని, దేశ నలుమూల నుంచి 200 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారన్నారు. 18 లైవ్ ఆపరేషన్లు(ఓపెన్, లాపరోస్కోపిక్, రోబోటిక్) జరిగాయని చెప్పారు. మణిపాల్ హాస్పిటల్స్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ కె.సుధాకర్ ఈ వర్క్ షాప్ ప్రాముఖ్యతను వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సహకారంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శనివారం ప్రారంభమైంది. సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గం దరఖాస్తు చేసుకున్న పోలింగ్ సిబ్బందికి సంబంధించి వివిధ అధికారులకు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శనివారం ప్రారంభమైంది. పాతబస్తీలోని కేబీఎన్ కళాశాల ఆవరణలో ఈ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు వివిధ విభాగాల వారీగా ఆ తేదీల్లో ఓటింగ్ అవకాశాన్ని కల్పించారు. పలువురు ఎలక్షన్ సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. మరో రెండు రోజుల పాటు ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌కు విచ్చేసి తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

బీసీలు, మైనార్టీలను సుజనా మోసం చేశారు

- దొడ్డిదారిలో టికెట్ తెచ్చుకున్నారు
- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, షేక్ ఆసిఫ్



40వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినాని నాని, ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి మైనార్టీలు, బీసీలను మోసం చేసి దొడ్డి దారిన టికెట్ తెచ్చుకున్నారని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని ఆరోపించారు. పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురం 40వ డివిజన్ పరిధిలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ ఆంజనేయరెడ్డితో కలిసి ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు వీధులలో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు.

సుజనా ఆటలు సాగవు..

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ.. కనకదుర్గమ్మ ఫ్లైఓవర్, బెంజ్‌సర్కిల్ ఫ్లైఓవర్, ఎయిర్‌పోర్ట్ తానే కట్టించానని సుజనా చౌదరి అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఈ ప్రాంతంలో చిన్న పిల్లవాడిని అడిగినా ఫ్లైఓవర్లు ఎవరు కట్టించారో చెబుతారన్నారు. సుజనా చౌదరి మైనార్టీలు, బీసీలను మోసం చేసి దొడ్డిదారిలో టికెట్ సంపాదించారో లేదో చెప్పాలన్నారు. వెస్ట్ నీ బెస్ట్ చేస్తానని, బ్యాంకర్లను మోసం చేసినట్లు వెస్ట్ ప్రజలను కూడా మోసం చేయాలని సుజనా చౌదరి చూస్తున్నారన్నారు. వెస్ట్ నియోజకవర్గ ప్రజల వద్ద సుజనా ఆటలు సాగవన్నారు. మాయలు, గారడీలతో చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతున్నాడని, ఆయనకు సుజనా చౌదరి షాడోగా ప్రవర్తిస్తున్నాడన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో సుజనా చౌదరి ఓడిపోవడం ఖాయమన్నారు. సామాన్యుడు, సమర్థుడైన షేక్ ఆసిఫ్ 30 వేల మెజారిటీతో గెలవబోతున్నారని కేశినేని నాని చెప్పారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. కూటమి పార్టీ నాయకులు వాళ్లలో వాళ్లే గొడవలు పడుతున్నారన్నారు. డబ్బుతో ఏమైనా చేయొచ్చని సుజనా చౌదరి అనుకుంటున్నారని, ప్రజా క్షేత్రంలో ప్రజలను ఆకట్టుకోవాలంటే సేవ చేసి ఉండాలన్నారు. దురుద్దేశంతోనే ఆయన బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశాడన్నారు. తమకు ప్రజా బలం ఉందని ఎన్నికల్లో నెగ్గుతామని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ప్రజలకు ఉపయోగకరంగా ఇటీవల విడుదల చేసిన నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టో ఉంటుందన్నారు. రెండు పర్యాయాలు ఎంపీగా చేసిన కేశినేని నాని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, తోలేటి శ్రీకాంత్, తనుబుద్ధి చంద్రశేఖర్ రెడ్డి, బొమ్మ మధు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సైకలాజికల్ కౌన్సెలింగ్‌తో సమాజ హితం

- ప్రముఖ వైద్యుడు డాక్టర్ సమరం
- స్పార్క్ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం



స్పార్క్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సమరం

పటమట(విజయవాడతూర్పు): ప్రస్తుత సమాజంలో ఉన్న రుగ్మతలను సైకలాజికల్ కౌన్సెలింగ్‌తో తగ్గించే అవకాశం ఉందని వాసవ్య నర్సింగ్ హోమ్ అధినేత ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం తెలిపారు. బెంజ్‌సర్కిల్‌లోని స్పార్క్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్ ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైకాలజీ రంగంలో రాణించాలంటే సమాజంతో అనుబంధం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సైకాలజిస్ట్‌కు ఉండాల్సిన ప్రధాన లక్షణం మానవత్వం అని, సంపాదన కోసం కాకుండా సంతృప్తి కోసం పని చేసినప్పుడు వృత్తిలో రాణిస్తారని తెలిపారు. అనంతరం ఆయన కౌన్సెలింగ్ సెంటర్ ప్రధాన హాల్‌ను ప్రారంభించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సైకాలజీ ప్రొఫెసర్ టి.డి విమల కౌన్సెలింగ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ విమల మాట్లాడుతూ.. నగరంలో కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభించిన సెంటర్ అధినేతలు రమేష్, కిషోర్‌లను అభినందించారు. అనంతరం థెరపీ రూమ్‌ను సైకాలజిస్ట్ సంఘం ఏపీఏ ఇండియా జాతీయ అధ్యక్షుడు బి.కృష్ణభరత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కౌన్సెలింగ్ కోసం వచ్చే వారి సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేయాలని సంస్థ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సెలింగ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ బి.రమేష్, బి.కిషోర్, సైకాలజిస్టులు శ్రావణి కృష్ణకుమారి, రమాదేవి, పద్మావతి, ఏఎన్యూ సైకాలజీ విభాగం అధ్యాపకులు అనుపమ, కృష్ణమోహన్, ఏపీఏ ఇండియా కోశాధికారి తేజ, హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ ఊ.ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ నగరాభివృద్ధికి వైఎస్ జగన్ విశేష కృషి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్



49వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఆసిఫ్

వించిపేట(విజయవాడ పశ్చిమ): టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు విజయవాడ నగరానికి చేసింది ఏమీ లేదని నగరాన్ని అభివృద్ధి చేసింది కేవలం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్.ఆసిఫ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అయన 49వ డివిజన్‌లో పర్యటించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు గొడిపేర సుధీర్‌తో కలిసి పలు వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టి పేద విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చదువుకునే విధంగా తీర్చిదిద్దారన్నారు. అమ్మ ఒడి, ఆసరా, సామాజిక పింఛన్లతో పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదని చెప్పారు.

నాడు 2014లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు జతకట్టి అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అభివృద్ధి పేరుతో అమరావతిలో పేద రైతుల భూములను దోచుకున్నారని ఆసిఫ్ ధ్వజమెత్తారు. నేడు మరో మారు ఎన్డీఏ కూటమిగా జతకట్టి అమలు సాధ్యం కానీ మేనిఫెస్టోతో రాష్ట్ర ప్రజలను మోసగించాలని చూస్తున్నాయన్నారు. ఈ సారి కూటమిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సుజనా చౌదరి దిగుమతి చేసుకున్న నాయకుడని, బ్యాంకులను మోసగించిన ఆర్థిక నేరస్తుడన్నారు. ఎన్నికల తరువాత నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండరన్నారు. తాను స్థానికుడినని, ఇక్కడి ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న తనను గెలిపిస్తే ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చెరుకూరి శ్రీనివాసరావు, యర్రజోన్న విజయలక్ష్మి, బూదాల శ్రీను, జార్జి, మార్క్, పావని తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చేయగలిగిందే చెబుతారు.. చెప్పిందే చేస్తారు



పాత ఆర్‌ఆర్‌పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పోతిన మహేష్, చలపతిరావు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా నాయకుడని తాను చేయగలిగిందే ప్రజలకు చెబుతారని, చెప్పిందే చేస్తారని వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన వెంకట మహేష్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన 56వ డివిజన్ పాత ఆర్‌ఆర్‌పేటలో స్థానిక కార్పొరేటర్ యలకల చలపతిరావుతో కలిసి పర్యటించారు. పేద ప్రజలు ఆనందంగా ఉండాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాలని ప్రజలను కొరారు. బీజేపీ మేనిఫెస్టో ఏమిటో, కూటమి మేనిఫెస్టోను బీజేపీ అగ్రనాయకత్వం ఎందుకు అంగీకరించటంలేదో సుజాన చౌదరి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు చెందిన వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ పశ్చిమలో పోటీ చేస్తే వారికి ఓట్లు వేయాలా అని ప్రశ్నించారు. 2014 నుంచి 2024 వరకు చంద్రబాబు కల్పించింది రెండు ఉద్యోగాలేనన్నారు. ఒకటి లోకేష్‌కు, మరొకటి దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌కు అన్నారు. అవ్వ తాతలకు ఇంటి వద్దకు పెన్షన్ రాకుండా ఎండాకాలంలో తీవ్ర ఇబ్బందులు పెట్టేలా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన దుర్మార్గులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లేనన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు రబ్బానీ, గొలగానీ శ్రీను, వాసాబాబు, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో పోతిన ఎన్నికల ప్రచారం

వించిపేట(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో స్థానికుడికి, స్థానికేతరుడికి మధ్య జరుగుతున్న ఎన్నికలని వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం 50వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు బంక విజయ, చాముండేశ్వరిలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని జోడు బొమ్మల సెంటర్, అరుణ స్కూల్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019లో నవరత్నలతో ప్రకటించిన మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసి ధైర్యంగా ప్రజల ముందుకు వస్తుంటే చంద్రబాబు 2014లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా ఇప్పుడు అమలుకు సాధ్యం కానీ హామీలతో మరోసారి ప్రజలను మోసగించేందుకు వస్తున్నాడన్నారు. ఢిల్లీ బాబును ఇక్కడ డంప్ చేసి గెలవాలనుకోవటం ప్రతిపక్ష పార్టీల అవివేకం అన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొక్కిలిగడ పార్వతి, హిమబిందు, మౌనిక, సూర్యకళ, రాజు, కనకారావు, రాము పాల్గొన్నారు.

ఆసిఫ్‌కు మద్దతుగా నిలిచిన గిరిజన సంఘాలు



నవీన్‌ను సత్కరిస్తున్న ఆసిఫ్, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు పలు గిరిజన సంఘాలు మద్దతుగా నిలిచాయి. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మానుపాటి నవీన్, కోశాధికారి తోకల చిన్న విరోజి, ఎరుకుల ఆత్మ గౌరవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దిల రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుడమల రామచంద్రయ్యలు విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి వచ్చి ఆసిఫ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి తమ మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది గిరిజనులు ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని చెప్పారు. అలాగే గిరిజనుల స్థితిగతులు మారి అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి

విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), మిమ్మల్ని గెలిపించుకుంటామని, అందుకు తమ సంఘాల పక్షాన కృషి చేస్తామని తెలిపారు. ఆసిఫ్ మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయిన ప్రజలు అధికారం అప్పగించి పొరపాటు చేశారని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో అధికార పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి ప్రజల విశ్వాసాన్ని పొందారని, అటువంటి నాయకుడు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఆంధ్రా మాల్యాగా పేరొందిన బ్యాంక్‌ల దొంగ, పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి ఓడినా, పొరపాటున గెలిచినా నియోజకవర్గంలో ఉండరని, లాబీయింగ్ చేసుకునేందుకు మళ్లీ ఢిల్లీ వెళ్లి పోవడం ఖాయమని చెబుతూ ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు జగన్నాథం చంటి, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేశనం హేమంత్ పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోను ఆ పార్టీ నాయకులే నమ్మటం లేదు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు కలిసి ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోను ఆ పార్టీ నాయకులే నమ్మటం లేదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు 35వ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్ ఇన్‌చార్జి నంబూరి ప్రదీప్‌తో కలిసి శరత్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని నిర్వహించారు. శరత్‌బాబు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో 650 హామీలతో ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించిన చంద్రబాబు వాటిలో ఒక్కటైన నెరవేర్చింది లేదన్నారు. సాధ్యం కానీ హామీలు, బూటకపు వాగ్దానాలతో ప్రజలను మరో మారు మోసగించేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ముందుకు వస్తున్నాయని ఎవరూ మోసపోవద్దని ప్రజలకు సూచించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు సంగీత్‌బాబు, సుజాత దాస్, నవీన్, రాకేష్, షీబా, కళ్యాణ్, వీరబద్ర, థామస్, శామ్, ప్రకాష్, సుధీర్‌బాబు, ఉషారాణి, నాగరాజు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్రమశిక్షణ, నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రశాంత వాతావరణంలో జరిగే ఎన్నికల నిర్వహణలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు పేర్కొన్నారు. ఈ నెల 13న జరుగనున్న ఎన్నికలకు సంబంధించిన విధుల్లో 1,250 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొనున్నారు. జిల్లాలోని వివిధ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్లను సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, గర్భిణులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహాయ సహకారాలను అందించాలని సూచించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సహకారం, సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, జిల్లా పోలీస్ నోడల్ అధికారి కృష్ణమూర్తి నాయుడు, పోలీస్ అధికారులు కాశీ విశ్వనాథ్, హరికృష్ణ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఇండస్ట్రియల్ ఏరియా, కబేళా సెంటర్, జోజినగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, సితార సెంటర్, లేబర్ కాలనీ, మిథిలా నగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, చెరువు సెంటర్, మర్రిచెట్టు సెంటర్, పెద్ద సాయిబాబా గుడి ఏరియా, రైతుబజార్ రోడ్, లలితా నగర్, మానవ మందిరం రోడ్, టీవీ కృష్ణారావు వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కేంద్ర అదనపు బలగాల కవాతు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కేంద్ర అదనపు బలగాలు కవాతు నిర్వహించారు. శనివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని డ్రైన్ వీధి నుంచి ప్రారంభమైన కవాతు పంజా సెంటర్, గొల్లపాలెంగట్టు రోడ్డు, వించిపేట ప్రాంతాల్లో జరిగింది. ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన ధైర్యాన్ని, సంఘ విద్రోహ శక్తుల నిర్మూలించే దిశగా పోలీసులు సంసిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం స్థానికులతో సీఐ గణేష్ మాట్లాడుతూ.. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందన్నారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఆకట్టుకుంటున్న చార్మినార్ ఎగ్జిబిషన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక పున్నమి ఘాట్ వద్దగల బబ్బూరి గ్రౌండ్స్‌లో హైదరాబాద్‌లో ఉన్న చార్మినార్ నమూనాతో ఏర్పాటు చేసిన చార్మినార్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. తమిళనాడుకు చెందిన కళాకారులు దాదాపు 400 మంది 50 రోజుల పాటు శ్రమించి చార్మినార్ నమూనాతో ముఖద్వారాన్ని తీర్చిదిద్దారు. ఈ ఎగ్జిబిషన్‌ను శనివారం సాయంత్రం వ్యాపారవేత్త బబ్బూరి భూపాల్ లాంఛనంగా ప్రారంభించారు. మహిళల కోసం బెంగాలీ కాటన్ శారీస్, లక్నో శారీస్, నైటీస్, కాస్మాటిక్స్, గాజులు వంటి అనేక హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ స్టాల్స్‌తో పాటు ఫుడ్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు పోతుల కృష్ణ అయ్యప్ప మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న మంజు రాజపాల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సాధారణ ఎన్నికల జిల్లా పరిశీలకురాలు మంజురాజపాల్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఓటర్ల అవగాహన సదస్సును శనివారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంజురాజపాల్ మాట్లాడుతూ.. కొత్తగా ఓటర్లుగా చేరిన విద్యార్థులు ఓటు వేయటాన్ని బాధ్యతగా గుర్తించాలన్నారు. ఇప్పటి వరకూ కౌమర దశలో ఉన్న విద్యార్థులు ఓటు హక్కు రావటంతో బాధ్యతయుతమైన పౌరులుగా మారారని చెప్పారు. ఓటు హక్కు వినియోగించుకోవటం బాధ్యతగా తీసుకున్నప్పుడు మాత్రమే మంచి వ్యక్తులను ఎన్నుకోవటం, ప్రజాస్వామ్యాన్ని కాపాడిన వారమవుతామన్నారు. ఎన్నికల రోజును పండుగగా జరుపుకోవాలన్నారు. విద్యార్థులు తమతో పాటుగా చుట్టు ఉన్న సమాజాన్ని సైతం ఓటు విషయంలో జాగృతం చేయాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించగా పశ్చిమ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ కిరణ్మయి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ సోమశేఖరరెడ్డి, స్వీప్ నోడల్ ఆఫీసర్ యు శ్రీనివాసరావు, జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రబోసు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఎన్.సాంబశివరావు, డి.పవన్‌కుమార్, కల్మాబేగం, శాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవాన్ని టీడీపీ దెబ్బతీసింది



మాట్లాడుతున్న బూదాల శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగుదేశం పార్టీ దళితులను ఓటు బ్యాంక్‌గానే చూశారు తప్పా, మనుషులుగా చూసిన పాపాన పోలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాలరాస్తున్న సుజనాచౌదరికి తగిన బుద్ధి చెబుతామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వించిపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎవరైనా ఎస్సీగా పుట్టలనుకుంటారా..? అని దళిత వర్గాలను అత్యంత దారుణంగా కించపరచటమే తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే కుట్రలు చేశారన్నారు. చంద్రబాబు బాటలోనే సుజనాచౌదరి సైతం దళితులను, వారి ఓట్లను కొనుగోలు చేస్తానని చెప్పటం దళితుల పట్ల వారికున్న ఉన్న వైఖరిని తెలియజేస్తుందన్నారు. పది వేల కోట్ల ప్రజా ధనాన్ని బ్యాంకుల నుంచి దోచుకున్న సుజనాచౌదరి పశ్చిమ నియోజకవర్గంలో దళితులను కొనుగోలు చేసి గెలవాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవాన్ని అమ్ముకునే దుస్థితిలో లేరనే విషయాన్ని సుజనాచౌదరి గ్రహించాలన్నారు.

నేడు దళిత వర్గాల ఆత్మీయ సమ్మేళనం

టీడీపీ ఎమ్మెల్యేలు దళితులపై దాడులు చేస్తుంటే చంద్రబాబు ప్రోత్సహించారన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఎంత మందిని మంత్రులను చేశారు, ఉప ముఖ్యమంత్రులను చేశారో దమ్ముంటే చర్చకు రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో యావత్ దళిత జాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవటానికి సిద్ధంగా ఉందని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో సుజనాచౌదరికి బుద్ధి చెప్పి ఆసిఫ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని అసెంబ్లీకి పంపించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అదే క్రమంలో ఈ నెల 5న దళిత వర్గాల ఆత్మీయ సమ్మేళనాన్ని పాతబస్తీలోని మాడపాటి క్లబ్‌లో నిర్వహిస్తున్నామని వివరించారు. సమావేశంలో నగర నాయకులు గాలి దుర్గారావు, దొడ్డ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరత నాట్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై శనివారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన భక్తులను అలరించింది. విజయవాడకు చెందిన హేమంత్ బృందానికి చెందిన పలువురు చిన్నారులు చక్కటి హావభావాలతో నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ప్రారంభమైన నాట్య ప్రదర్శనను ఆద్యంతం భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు ఆలయ ఈవో కె.ఎస్.రామరావు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి, ప్రత్యేక దర్శనం కల్పించారు.

